

# కర్త-కర్మ-క్రియ

ఆమె నడుస్తూ వుంది!

ఆమేగాదు—సకల చరాచర ప్రపంచము నడుస్తూవుంది!-అది దాని కర్తవ్యం కాబట్టి!!

నడక! ఓహ్....ఎన్ని రీతులు?....

సువాసనపుటలలలో చిక్కి, చిందిపోతున్న చిరునవ్వును పెదవుల మధ్య నొక్కి, ఎత్తు మడమల జోళ్ళపైకెక్కి నడుము నాజూకును నడకలో చూపిస్తూవుంది—ఓ నైలానుచీర నారి!

జతకోళ్ళకు బదులు జతపావుకోళ్ళు .... జోళ్ళమీద కాళ్ళకుబదులు పావుకోళ్ళమీద చేతులు....చారడేసిమాసికలతో మూరెడంత తుండుగుడ్డ మొలకు....ఎదుగు బొదుగు లేకుండా పెరిగిన వెంట్రుకలను నిగ్గతీసికట్టిన జానెడుగుడ్డ తలకు....ఒక్కముంపులో మూరెడు ముందుకు పడుతూవుంది కదల్లేని పిండము—కాళ్లలేని మొండెము!!

అన్వేషిస్తున్న కళ్లు....ఆక్రోశిస్తున్న హృదయము....ఆధారభూతంగా

కనబడుతూవున్న మాసిన గడ్డము, అంతకంటే మాసిన గుడ్డలు....పంతం వేసుకొని ప్రజలు పలుకుతూవున్న కాళ్ళుచేతులు — వడిశెల రాయిలా దూసుకుపోతున్నా డొక భావోద్రేకి!

స్వార్థము .... కుళ్ళు ....కుత్సితము .... దురాశాది భావాలకు తెల్లటి ఖద్దరు బురఖా తొడిగి, దేశసౌభాగ్యము....ప్రజాసేవ....ధార్మిక చింతన— ఆదిగాగల ఆశయాలను మడతపెట్టి సరిగంచు పూతతో సింగారించి పైపంచెగా భుజమలంకరించి, యింత జాగ్రత్తపడినా లవలేశం బయటపడునేమో యన్న సందేహాన్ని నల్లటి కళ్ళజోడు నివృత్తిచేయ, 'ఇదిగో! యిలాగే! అచ్చంగా యిలాగే!!—అసహాయులు, అసూయాద్వేషులు, బీదలు, అభ్యుదయ వాదులు నా చేతికి చిక్కితే, యిలాగే మొట్టుతా'నంటూ కుడిచేతి కర్రను నేలకుతాకిస్తూ, ముందుకు హుందాగా సాగిపోతున్నాడొక రాజకీయ వాది!

ఏమిటీ నడక? ఎక్కడ దీని గమ్యం?

సామాన్య మానవునికి అర్థంకాని ప్రశ్న! అనాదిగ అందరి బుర్రలను వేడెక్కించిన ప్రశ్న!!—అయితే దీనికి సమాధానమే లేదా— అంటే;

'ఈ ప్రపంచమంతా మిథ్య. అందులో మనం నిమిత్తమాత్రులం'- అని వాదించే వేదాంతి, 'ప్రకృతి అంతా శాస్త్రమయం. ప్రతి అణువులోను మానవాభ్యుదయమున కుపకరించే ఏదో మహత్తరశక్తి యిమిడివుంది'— అని భావించే ప్రగతి కాముకుడయిన శాస్త్రజ్ఞుడు 'జుట్లు' పట్టుకొంటారు. సాధారణంగా సామాన్య మానవుడే శాంతి కాముకుడు. 'జుట్లు' పట్టించి వేడుక చూడడం అతని ధ్యేయంకాదు. అతని చేతనుకాదు. ఉన్నదానితో సరిపెట్టుకొనడ మతని జీవిత లక్ష్యం. అందుకే ఎవరు ఎలా నడిచినా, ఎటు నడిచినా—కేవలం కూటికోసమే నంటాడు.

అందుకే ఆమెగూడ నడుస్తూ వుంది! అదే జానెడు పొట్టకు పిడికెడు కూటికోసం!

జానెడు పొట్ట!....పిడికెడు కూడు!!

ఎన్ని వేషాలు?....మరెన్ని మోసాలు??....

తలలుమార్చేవా డొకడయితే, తలగుడ్డలు మార్చేవా డొకడు. కడప కడప తిరిగే దొకరైతే, కడప కడపను చెమటతో కడిగేవా ళ్ళొకరు. అభిమానంతో అవస్థపడే దొకరయితే, మానాన్ని అమ్ముకొని బ్రతికేవా ళ్ళొకరు. అయితే అందరూ సంఘజీవులే.

ఒకడు హంతకుడు! మరొకడు వంచకుడు!!

ఒకడు యాచకుడు! వేరొకడు సేవకుడు!!

ఒకడు అభిమాన పరుడు! మరొకడు మానహీనుడు!!

సాంఘిక పరిభాషలో వీళ్ళకు సంక్రమించిన బిరుదులివి!

'ఏమిటీ తారతమ్యం?' అంటే 'కర్మ' అంటాడు వేదాంతి. చేత గాని తనమంటాడు శాస్త్రవేత్త. ఒకజన్మలో చేసింది మరొక జన్మలో అనుభవించడం యుగధర్మమైతే, ఆ చేత్తోచేసి ఈచేత్తో అనుభవించడం కలియుగ ధర్మమంటాడు సామాన్య మానవుడు చాల తేలికగా!

లేకపోతే, ఎవరిజోలి అక్కరలేకుండా, ఏ మూలనో ఒకమూల, జపమాల తిప్పుకుంటూ దర్భాసనంమీద దర్జాగా కూర్చుంటే, కనుసన్నల రాజ్య మేలవలసిన వయస్సులో, కాళ్ళీడ్చుకుంటూ .... ఎందుకు ఆమె నడుస్తూ వుంది?—ఇదే ప్రశ్న మీ మనస్సునుకూడ కెలుకుతూ ఉందికదూ! అయితే చదవండి.

* * *

"బాబూ! నేను చాలా మెతకవాణ్ణి. 'అందరు మనుష్యులే! ఆనందం అందరి సొమ్ము!' అని నా అమృతహస్తమెత్తి ఆశీర్వదించబోతే, తిన్నయింటికి వాసాలెంచే మానవులు, నన్నే తూట్లుపొడుస్తున్నారీ రాకెట్లతో. నాగతి నీకు పట్టకుండా చూసుకో!" అని హెచ్చరించినట్లుంది చంద్రుడు సూర్యభగవానుణ్ణి. కోపాగ్నిజ్వాలలు కక్కుతున్నాడా మహానుభావుడు.

ఆ ధాటికి తట్టుకోలేక వడలిపోతూ వుంది వృక్షసంతతి. హడలిపోతున్న ప్రాణికోటి, కాసంత చెట్టునీడకై తాపత్రయపడుతూ వుంది. అయితే ఆమె మాత్రం....

అందీ అందని చీరకొనకొంగు చాలీచాలని చుట్ట....ఆ చుట్టపై పెద్ద బుట్ట....ఆ బరువు ఉచ్చిపీకుతూ వుంటే, మనసు వచ్చీరాక గొడారికుట్టిన జతజోళ్ళలో ఒకదాని పట్టెడస్థానాన్ని ఒకతీట్రి తీగ ఆక్రమించుకొని వక్రగతులు పట్టిస్తూ ఉంటే, ఆ కాలిబాటలో గులకరాళ్లు వేమనగారిపద్యాన్ని మననం చేసుకోమని హెచ్చరిస్తూ వుంటే, ఎప్పుడో వేకువజామున మూడు మెతుకులు విదల్చి, ముంత మూడుచుట్లు తిప్పి, నోట్లో పోసుకున్న దోసెడు కూటినీళ్లు చెమటరూపాన్ని సంతరించుకోగా, కాలేకడుపులో ఆవిర్భ వించిన వేడి ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో నాలుక పిడచకట్టుకపోగా, కాలుదీసి కాలుపెడుతూవుంది! అంటే - ఆమె నడుస్తూ వుంది!!

ఇక అల్లంతదూరంలో ఈ కాలిబాట ఒక బండిబాటతో కలుస్తూంది, పిల్లకాలువలు పెద్దనదిలో చేరినట్లుగ. అక్కడ ఏ మహానుభావుడో,ఈలాంటి అభాగ్యులపాలిట దేవుడు—రెండు నిలువురాళ్ళు పాతి వాటిపై అడ్డంగా ఒక బండను అమర్చినాడు. నెత్తి బరువు దించడానికి, కాస్త ఊపిరి పీల్చు కొని, ఆపై నెత్తుకోవడానికి. జనసంచారములేని ఆ మారుమూలల్లో ఎంతేని ఉపకరిస్తుందీ బండ. సువర్ణాక్షరాలతో లిఖించి పేరు సార్థకపరచుకోవడానికి ఈ ఉపకరరణం, ఈ యుగధర్మంకాదు. కాగా ఆ పుణ్యభాగుని పుట్టు పూర్వోత్తరాలు గుప్తంగానే ఉండిపోయాయి. అంతేగాదు—ఆ ప్రక్కన ఒక రావిచెట్టును నాటినాడు అదే చేతులతో. అది మహావృక్షమై ఆశ్రితజన రక్షగా ఉంది. వడలిపోయిన ఆకుల సందునుండి, పొడలు పొడలుగా పడు తున్న వడథాటకి తట్టుకోలేక ఆ చెట్టునీడనుండి బయలుదేరిన కాషాయ వస్త్రధారి, "ఎవరు చేసిన కర్మ వాళ్ళనుభవింపక తప్పదన్నా!" అని పాడు కొంటూ ఎండనుపడ్డాడు ఈ నీడకంటే, అదే నయమని!

పారిజాత పరిమళము....మల్లెల సౌరభంతో మత్తెక్కే సౌందర్యోపాసకుడైన భావుకునికంట యిలాంటి సంఘటనలు పడడం అరుదు. అథవా తటస్థించినా చీదరించుకొంటాడేమోగానీ, ప్రగతి కాముకుని ఎదుటబడితే, "ఓ వృద్ధనారీ! నమస్కారం. బట్ట పడతపడకుండ పొట్ట గడవాలి" అని వెట్టిమొట్టి వేషాలువేసే ఈ కాలపు సోమరిమూకకు నీవు ఆదర్శప్రాయురాలివి. ఈ భారతావని శోభాయమానంగా వెలుగొందాలంటే, నీలాంటి కర్మయోగులే అవసరం! రా తల్లీ! రా!! ఈ బండమీద ఆ బుట్టను దించి, ఆ చెట్టునీడను కాసేపు సేదదీర్చుకో!" అనక మానడు.

ఆమె నిలువురాళ్ళను సమీపించింది, ఆ ప్రగతికాముకుని ఆహ్వానం మీద కాదు—అది ఆమె దినచర్య కాబట్టి! బుట్టను బండమీద దించింది. ఉసూరుమంటూ ఆ చెట్టునీడను చతికిలబడింది.

కనుచూపు మేరలో చెట్టుగానీ, గుట్టగానీ లేని ఆ బోడిబోడిచెట్ల బయల్లో వడగాలి ధాటికి గూబలు 'గుఁయ్' మంటున్నాయి. కుక్షింభరత్వాన్ని గూడ విడనాడి పక్షిసంతతి ఆ రావిచెట్టు ఆకులమాటున తలదాచుకొంటున్నది. ఏటేటా వేసవిలో, రైతులు కాస్త ఊపిరి పీల్చుకొనే సమయములో అక్కడికి రెండుమైళ్ళ దూరంలోవున్న నల్లవెంగనపల్లెతో వెంగమనాయుడి ధర్మమంటూ భారతోత్సవాలు వైభవోపేతంగా జరుగుతాయి. ఆ ఉత్సవాలలో పగటికథ ఓ తంతు!....అంటే, ఓ పండితోత్తముడు భారతమంతటి ఉద్గ్రంథాన్ని పదునెనిమిది రోజుల్లో పారాయణం చేస్తాడు దినమునకొక్క పర్వము వంతున—పసిపిల్లవాడు నిముషానికొక్క చెఱకు గణపు తిన్నట్లు! ఆ కథను వినగోరిన చుట్టుప్రక్క పల్లెవాసుల కదేదారి. కాగా ఒకటీ అర ఆ రోడ్డుమీద పడ్డారు.

ఆమె!....మాడా లచ్చుమక్క! ఒకప్పుడు మహడీ లక్ష్మమ్మ! ఆ మారుమూల పల్లెల్లో తొలిసారిగా మహడీ కట్టుకొనే భాగ్యము ఆ యింటికే లభించింది. కనుక, ఆలాంటి కట్టడాన్ని కూడ చూడనోచని పల్లెప్రజలు,

అదివరకు తరతరాలుగ వస్తున్న యింటిపేరును కాస్త అవతలికితీసి, ఆస్థానే మహాడీని తగిలించారు. క్రొత్త ఒక వింత!—అంటే, ఆ నాటినుండి ఆ యింటికి మహాడీ వాళ్ళన్న పేరు సార్థకమైపోయింది. కాలపురుషుని మహిమ!—'మహాడీ' పంది నోళ్ళల్లో 'మాడీ'కాగా, 'లక్ష్మమ్మతల్లి లచ్చుమక్కగా మారింది. లేకపోతే, 'లచ్చుంవమ్మతల్లీ! రాతిరి మా ఇంట్లోది వంట్లో నలతగా వుందని నూకలు నీళ్ళల్లో పొయ్యలేదు. పొద్దన కూటినీళ్ళు కూడా లేవమ్మా!! కడుపుమంటతో కండ్లు బైర్లు కమ్ముతున్నాయి!' అని ఆవుల వేళప్పుడు గొడారి రాముడు మొరపెట్టుకొంటే, 'ఉండరా! రాముడూ! వస్తున్నా'నంటూ వంటగదిలోకి వెళ్ళి, చింతగింజవేస్తే మునగని చిక్కని పజ్జిగలో అరముద్ద సంకటి కలిపి, వాడి దోసిట్లోపోసి, ఒక దబ్బ మామిడి కాయ ఊరుగాయ చేతికందిస్తే, తుమ్మితే ముక్కుల్లో పడేవరకు మెక్కి, 'నూరేండ్లు చల్లగా బతుకు తల్లీ!' అని గొణుక్కుంటూ, చేతికి మిగిలిన సద్దిబువ్వ నాక్కొంటూ 'చేతులు కడుక్కోరా!' అంటూవుంటే గూడ విని పించుకోకుండా వెళ్ళిపోయే రాముడు—'రామయ్యా! చెప్పుపట్టెడ తెగి పోయింది. కాస్త కుట్టిపెట్టరాదూ!' అని అడిగితే, 'తొలికోడి కూసేయాళ కాడ కూతేసినాడు కామసాని పెద్దబ్బ. మోటబాన చినిగిపొయ్యిందంట! తొందరగా పోతుండా! రేపెప్పుడైనారా. సూద్దాంలే లచ్చుంవక్కా!' అని తప్పుకపోతున్నా డీనాడు.

అయినా ఆమె బ్రతుకుతూనే వుంది!

అల్పస్వల్పమైన గుండెలైతే, పువ్వులమ్మిన చోట కట్టెలమ్మవలసి వచ్చినందుకు, ఆమె ఏ నుయ్యో గొయ్యో చూసుకోవలసి వచ్చేది. కాని ఆమె ఆ కోవకు చెందిన మనిషిగాదు. అందుకే ప్రతిదినము ఆమె కోడికూత వింటుంది. అంటే—అదివరకే నిద్రలేచి, కాసిని మంచినీళ్ళు నోట్లోపోసు కొని పుక్కిలించి ఉమ్మి, గుడిసెముందు కసవు చిమ్మి, ముంతెడు నీళ్ళు చల్లి, మూడు అడ్డగీతలలో ముగ్గు పూర్తిచేసి, ఆపై ఉట్టిమీద బుడ్డిలోని

ఆముదమంత అరచేతిలో వేసుకొని ఉచ్చికిరాసి, గంప నెత్తికెత్తుతుంది. ఇంతకూ ఆమె నిద్రపోయిం దెప్పుడని?—ఉదయాన నీళ్ళలోపోసిన పప్పు రుబ్బి, వడలుగాల్చి, ఆ వేడిమీదనే గుగ్గిళ్ళు ఉడకబెట్టి, తమలపాకులు పేర్చి కట్టలుకట్టి, పొగాకు కాస్త పదునుచేసి గోనెపట్టలో చుట్టిపెట్టి, అన్నిటినీ గంపలో పొందుగా అమర్చి, ఆపై నాలుగు మెతుకులు ఉడకబెట్టి నోట్లో వేసుకొని, ఏ రెండవజాము అంత్యములోనో అలా నడుము వాల్చుతుంది.

కోడికూతతో బయలుదేరిన 'లచ్చుమక్క' పొద్దు నడిమిట్టకెక్కేసరికి నాలుగైదు మైళ్ళలో నున్న ఓ అయిదారు పల్లెలు తిరుగుతుంది. అత్త చాటు కోడళ్ళు అరపడిరాగులతో 'ఆకువక్క' కొంటే, తల్లిచాటు పిల్లలు తవ్వడు జొన్నలతో గుగ్గిళ్లు కొంటారు. పొలంగట్టుమీదపడి నడుస్తూంటే, సద్దిబువ్వ తింటున్న రైతులు మిరపతోటలో వంకాయలో, లేదు కాసిని పచ్చిమిరపకాయలో కోసియిచ్చి వడలు కొంటారు. గొఱ్ఱెలు కాచుకొంటున్న బుల్లోళ్ళు సోలెడు పాలిచ్చి పొగాకుకాడ కొంటారు. ఈ వూరినుండి ఆ ఊరి కెంత దూరమో ఈ వూరినుండి ఆ ఊరి కంతే దూరమన్నట్లు, వస్తువులు మారినా దాదాపు బరువుమాత్రం అలానే వుంటుంది. అదే బరువుతో ఆమె యింటి ముఖం పట్టుతుంది పొద్దునెత్తి కెక్కినపుడు!....

ఆ రావిచెట్టు నీడలో ఆమె అలా చతికిలబడిందో, లేదో ఎప్పుడో మూతలుపడ్డాయి కండ్లు. అలసిసొలసిన శరీరానికి ఆ రావిచెట్టుబోదె హంస తూలికాతల్పమైనట్లుంది పాపం!

ఎంతోసేపు గడువలేదు ఆ విధంగా. అంతలోనే 'అంబా'అన్న ఉంకె చెవిని పడడంతో అదిరిపడిలేచింది ఆమె! ఆ బాటమీద వెడుతున్న సవారిబండికి గట్టిన దాపటిగిత్త, కాలుగీరి, ఖణిల్లని 'ఉంకె' వేసి మోర ముందుకు చాచడంతో, అమాంతంగా బండి ఆమెవైపు మళ్ళింది. అంత లోనే చేతికోల 'ఛళ్లు'మని ఎడమచేతి పగ్గాలు బిగుసుకపోతే దారితప్పిన

బండి యథాలాపంగా దారినపడింది రెట్టించిన వేగంతో! ఆ ఎద్దును అలానే చూస్తూ వుండిపోయింది 'లచ్చుమక్క'.

ఆ ఎద్దు!—దాపటగట్టిన ఎఱ్ఱటి ఎద్దు. ముఖాన మూడునామాలు తీర్చి దిద్దినట్లు ముచ్చటగొలుపుతున్న ఎద్దు!—తాను లక్ష్మమ్మగానున్న రోజుల్లో తోటిగంగులు పలమనేరు పరసలో పట్టుకొచ్చాడు పదిరూకలు సరసమని! అది యే విధంగా యిల్లుచేరిందో దేవుని కెఱుకగానీ, వచ్చిందిమొదలు మనిషిని దరిదాపులకు రానీయదు. అథవా ఎవరైనా యత్నిస్తే, ముంగాళ్లు రెండు పైకెత్తి పైబడ నుంకిస్తుంది పొగరుమోతు గుఱ్ఱంలాగ! అందుకే తోటిగంగులుగాడు రెండుపగ్గాలతో దానిని గాటగట్టి, ఒక వెదురుబొంగు కొన చీల్చి, అందులో ఒక చట్టినిగట్టి దూరంగా నిలబడి నీళ్ళు త్రాగించడం, అంతకంటె దూరంగా నిలబడి పిడికెడు కసవు విదిలించడం చేస్తున్నాడు. ఒకనాడు లక్ష్మమ్మ కూలీలకోసమని వాడలో అడుగుబెట్టి, అడుగు కదల్చ కుండా నిలబడి, ఆపై ముక్కుమీద వేలేసి, గంగులయ్యను, "ఏమిటి సంగతి?" అని అడిగింది. గంగులయ్య ఓ కథంత ఉదంతంచెప్పి తల బాదు కొన్నాడు. ఏ మనుకొనిందో యేమో లక్ష్మమ్మ—ఎద్దును సమీపించి మూపు తట్టింది. ఆ చల్లని చేతి చలువతో పొగరుబోతు తనానికి చలువలు కమ్మిందేమో?—అరమోడ్పు కన్నులతో ఆ ఎద్దు మోర ముందుకు చాస్తే, పగ్గాలు విప్పి చేతపట్టుకొని, "గంగులూ! సాయంకాలం వచ్చి లెక్క తీసు కోరా!" అన్నది, ఆ ఎద్దు తన్ను పిల్లిలాగ అనుసరిస్తూ ఉంటే! ఓ బాధ తప్పిన గంగులయ్య, "నా ఆయుస్సు బోసుకొని నూరేండ్లు బతుకు తల్లీ!" అని రెండు చేతులెత్తి దండం పెడితే—వాడలోని ఆబాలగోపాలం దవడలు నొక్కుకున్నారు, ఆ యిల్లాలి దర్పంజూచి. ఆ నాటనుండి బిడ్డలాగ మేపింది ఆ యెద్దును. పరిస్థితులు మారినా, పద్ధతులు మారినా, ఆ నోరు లేని గొడ్డు మాత్రం తనని మరచిపోలేదు. కానీ ఆ బండిలో పోతున్న వాళ్ళు మాత్రం?....

అదే బండిలో, అదే బాటమీదుగ తాను ఆ యింటికి కోడలై ఆ వూళ్ళో అడుగుబెట్టిన నాటినుండి భారతోత్సవాలకు యేపేటా ఎన్నోసార్లు వెళ్ళింది. ద్రౌపదీ మానసంరక్షణం కథ విని, ఆ రాత్రి నాటకం చూడవలె ననుకోవడమే తడవు! అంగిట మాట అంగిట ఉండగానే యింటి ముంగిట బండి నిలబడేది. రంగడు బండి కడిగి, ఆకులకు రంగుపూసి, వెదురు చాపలతో సవారికడుతూ ఉంటే, ఆయన వరి కసవు పఱచి దానిపై గోనెపట్ట వేసి, దానిపై లేత ఆకు చాపలు పరచి మెత్తని పరుపులాగ తయారుచేసే వారు. అంతటితో వదలకుండ ఎద్దులనుకూడ కడిగించి, కొమ్ములకు రంగు పూసి, కుప్పెలు తొడిగి, మెడెపట్టెలుగట్టి, సరిగంచుసుంగు తలపాగ రాజ తీవిని ఒలకబోస్తూంటే, తానే స్వయంగా బండి తోలేవారు. సేద్యగాడు రంగడు బండి ముందు ఒక్క లగువులో వెడుతూంటే, వాడి పెళ్ళాం మంగి, చంకబిడ్డ జారుతూంటే, "ఆ బిడ్డనైనా యిలా కూర్చోబెట్టవే!" అంటేగూడ వినిపించుకోకుండా, "నా కిదేం లెక్కలేమ్మా!" అంటూ బండి వెంటబడేది! వాళ్ళే! రంగడు, వాడి పెళ్ళాం మంగి, ఆ నాటి తన స్థానాన్ని ఆక్రమించుకొంటే, వక్రగతులు పట్టింది తన బ్రదుకీనాడు."!

ఎవరో గుండెలపై గునపాలతో బాదినట్లయి, ఆపై ఆలోచించలేక పోయింది. బండి ఒక్కమురుపులో బొట్లవారిపల్లెమిట్ట ఎక్కుతూంటే, ఎద్దుల మెడ పట్టెల్లోని చిరుగంటలనాదం లీలగా వినిపిస్తూ ఉంది. ఇక అక్కడ ఉండలేక ఉండి ఆ దృశ్యాన్ని భరించలేక, ఆమె గంపనెత్తి కెత్తు కొనింది!

ఆమె నడుస్తూ ఉంది!....ఆలోచనలు వెనక్కు నడుస్తున్నాయి.

ఆ రోజు—

తనకు బాగా జ్ఞాపకం. ఆ రోజు కూడ తూర్పు ప్రక్కనే అదే చింతచెట్లమాటున పుట్టింది పొద్దు. పడమటి పక్కనే బోడిగుట్టల వెనుకనే క్రుంకింది. తన పిచ్చిగానీ, ఆ రోజ మాత్రమే యేమిటి?—తనకు బుద్ధి

తెలిసిననాటినుండి ఆ విధంగానే జరుగుతూ ఉంది. ఆ గమనంలో ఏమాత్ర మైనా కుంటుపడినట్లు తనకు తెలియదు. చెప్పగా వినలేదు. ఒక్క పగటి కథలో పండితోత్తముడు తప్ప. ఆయనకూడ చూడలేదట! ఎవరో ఒక మహా సాధ్వి! తన భర్తకు జరుగబోయే ముప్పును పురస్కరించుకొని సూర్యుడి గమనాన్ని ఆపివేసిన సంగతి ఒకరు పద్యరూపంలో పారాయణం చేస్తే తాను కథలాగా చెప్పాడు. అంతే!—అయితే ఆ గతితప్పని లయలో ఎన్ని అపశ్రుతులు దొర్లిపోతున్నాయో?

తన ఆలోచనలు తనకే విపరీతంగా తోచి ఒక్కసారి నవ్వు కొనింది లచ్చుమక్క. తన రూపం, తన బ్రదుకు, తన ఆలోచనా పరిధి — ఎవరైన చదువుకొన్న మహాశయుడు వింటే తనకంటే ఎక్కువే నవ్వుతాడు. ఎందుకంటే, అనుభవం సంగతి అతనికి తెలియదు కాబట్టి! లేకపోతే—తన కత్తికి యెదురులేకుండా, ఆ గ్రామాన్నంతా గడగడ లాడించిన గంగిరెడ్డి, ఆ వూరికి మూడామడల దూరాన—అదిగూడ ముష్టి చెట్లమాటున, నీళ్లేటట్లు తన్నులుతిని మూడురోజుల తరువాత ముట్టుకోలేని స్థితిలో ముక్కలు పట్టుకొని దహన సంస్కారాలు అయిందని పించుకొంటే, ఎవరో దారినపోతూండిన దానయ్య ప్రొద్దుక్రుంకేసరికి ఆ వూళ్ళో అడుగుబెట్టి, ఆకలిబాధకు తట్టుకోలేక, అభిమానంతో అడుక్కోలేక భజనమందిరంలో కూర్చుని ఆత్మారాముని తృప్తికోసం రామనామ స్మరణ చేస్తే విందుభోజనం జరిగిపోయింది! ఆపై ఆ గుళ్లో కాసేపు కన్ను మూసి ఉదయాన వెడదామనుకొన్న ఆ పుణ్యాత్ముడు ఆ గుళ్ళోనే శాశ్వతంగా కన్ను మూస్తాడని ఎవరికి తెలుసు? మహావైభవోపేతంగా దహన సంస్కా రాలు జరిపించుకొంటాడని ఎవరికి తెలుసు? కాలపురుషుని మహిమలు! ఒక చోట వెలుగు....ఒకచోట చీకటి....ఒకచోట పెండ్లి....ఒకచోట చావు.... ఒకచోట నవ్వు....ఒకచోట యేడుపు....అంతా విడ్డూరమే! అయితే ఈ విడ్డూరాలన్నీ కర్మసాక్షి కంటబడినట్లు లేదు. లేకపోతే ఏ మాత్రమైనా పట్టించుకోకుండా అంత నింపాదిగా నడుస్తాడా ఆ రోజు కూడా వాడు!

ఆ రోజు ఆయన మంచంమీద నిర్జీవంగాపడి ఉన్నాడు. ఊరు పూరంతా ఒకసై యిల్లు నిండిపోయింది. మాంత్రికుని చేతుల్లో వేపమండలు గిరికీలు కొడుతున్నాయి. కసక్కుమని నోటితోనే కోడిపుంజు గొంతుకొరికి ఆ రక్తంతో తాను తీర్చిన బొమ్మకు మూడుసార్లు దిగతీసి, ఆపై కోడిని చంకనబెట్టి ముసుగువేసి, చల్లగా జారుకొంటున్నాడొక భూతవైద్యుడు. సుమారు యేడాది క్రిందట పాతగుంటలో మకాంపెట్టి, వైద్యం సంగతి అటుంచి, హస్తవాసిలో అఖండ పేరుప్రఖ్యాతులు గడించిన ఇంగ్లీషు వైద్యుడు సూదిమందు తయారు చేసుకొంటున్నాడు. ఎక్కడినుండి ఊడి పడ్డాడో నాటువైద్యుడు శీపాటి వెంకటరెడ్డి. ఒక్కవూపులో జనాన్ని చీల్చుకొని లోపల ప్రవేశించాడు. ఆయన చేతిని తన చేతిలోనికి తీసుకొని నాడి పరీక్షలో మునిగిపోయాడు. తప్ప త్రాగి తూలుతున్నా తప్పు పలకని నోరు వెంకటరెడ్డిది. అక్కడి 'హంగామా' అంతా ఒక్కసారి తేలిపార చూశాడు. ఒక్క వెఱ్ఱి నవ్వు నవ్వి "మీకేం పిచ్చిపట్టిందట్రా! ఎఱ్ఱినాయాలి గుంపా! ....ఇంకొక్క గంటేరా అబ్బాకు! ఆ మీదట....అంతే!!" అంటూ వచ్చిన వాడు వచ్చినట్లుగ వెళ్ళిపోయాడు—లేదంటే ఆ పిచ్చి నవ్వును కాస్త పొడిగిస్తూ.

"అయ్యో! యిదేం మాయదారి రోగంవమ్మా! ఎంతమంది వైద్యులు? ....ఎంత మందు!....ఎన్ని రూపాయలు! ఏం కత? దీని అంతే తెల్లేదు! ఏంవి కలికాలంవో? ఏం రోగాలో?" అని వాపోయింది అక్కడ గుమిగూడిన అమ్మలక్కల్లో రామలక్ష్మమ్మ.

రంగడు తలదగ్గఱ కూర్చుని తల బాదుకొంటున్నాడు. తాను ఓ మూల కూర్చుని తపించిపోతూ ఉంది. ఆ యింట్లో అడ్డదిడ్డమైన పనులతో అటు యిటూ తిరుగుతూ ఉంది రంగడి పెళ్ళాం మంగి. రామలక్ష్మమ్మ మాటలు తన చెవుల్లో పడ్డాయి. నిజమే! ఎంతోమంది వైద్యులను పిలి పించింది. ఎన్నో మందులు యిప్పించింది. చెప్పిన దేవుడుకంతా ముడుపు

గట్టింది తన భర్తను రక్షించమని. రూపాయను పైసాలాగ చూచింది. ఫలితంగా అంతుచిక్కని రోగం వైద్యులకు, అంతు తెలియని ఆయన ప్రవర్తన తనకు మిగిలాయి!

ప్రవర్తన అంటే జ్ఞాపకం వస్తూ ఉంది. వెనుకాముందు ఎవ్వరు లేని ఆ యింట్లో కొత్తకోడలుగా 'బిక్కుబిక్కు'మంటూ అడుగుపెట్టింది. లంకంత ఆ కొంప.... ఒంటరిగా ఆయన.... ఆ యింటి ఆవరణలోని గుడిసెలో రంగడు, వాడి సంసారం.... యే విధంగా కాలం గడుస్తుందో అని భీతి భీతిగా ఉంటే, ఆ భీతిని ఆయన పరిష్కరించారు చాల చిత్రంగా! "చూడు లక్ష్మీ పొలములో మడక కట్టుతాము. ఎడమచేత పగ్గాలుబట్టి, కుడిచేత ములుకోలపట్టితే, మడక చెప్పినట్లు తిరిగి పొలాన్నంతా దుక్కిచేస్తుంది. ఆ పొలంలో పంట, పగ్గాలు చేతబట్టినవాడి ప్రతిభమీదనే ఆధారపడి ఉంటుంది. ఈ సంసారానికి నీవూ అంతే!" అంటూ యినప్పెట్టె తాళాలు చేతికిచ్చాడు. గుండెకోసి అరచేతిలో పెట్టడం, పువ్వుల్లో పెట్టి పూజించడంలాంటివి యథాతథంగా జరుగకపోయినా అంతకంటే మిన్నగానే భావించింది తన కాపురాన్ని. ఆ రోజునుండి వరి నాటడానికి కూలీలు కలుపుతీయడానికి మనుష్యులు.... అంతా తన చేతిమీదుగా సాగింది. మెట్టినింట వరించినకీర్తి పుట్టినింటివరకెగ్రాకి కన్నప్రేవులు కమ్మని ఊహల్లో తేలిపోయాయి. కానీ విధివైపరీత్యం....

అప్పటికి సరిగ్గా అయిదు సంవత్సరాలక్రితం "ఇదో! రెండు రోజుల్లో తిరిగిరానూ!" అంటూ ఏదో పనిమీద గ్రామాంతరం వెళ్ళినతడు సుమారు పదిహేను రోజులవరకు తిరిగిరాలేదు. తనకు పెండ్లి అయిన నాటి నుండి చూస్తూనే ఉంది—ఆ విధంగా యెన్నడూ జరగలేదు. నూరు ఆరయినా, ఆరు నూరయినా ఆయన నోరుజారని మాటకారి. అందుకే ఆలస్యాన్ని ఆలోచించలేక మనసు పరిపరివిధాల పోతూవుంటే, ఆ నాడు రాత్రి యెనిమిది గంటలై ఉంటుంది. తాను పుట్టింటినుండి పట్టుకవచ్చిన

భాగవతాన్ని దీపం ముందుంచుకొని కూర్చొనింది నాలుగు పద్యాలైన చదువు కొందామని. అలా కూర్చొనిందో లేదో, 'ఖణీల్లని' అంకె చెవిని పడింది.

ఎప్పుడైనా ఏదైనా విడ్డూరం జరిగితేగానీ, ఎద్దు ఆ విధంగా 'అంకె' వేయదు. ఏం జరిగిందో యేమో అన్న సంశయంతోనే పుస్తకాన్ని మడిచిపెట్టి తాను కొట్టంవైపు వెళ్ళింది. అక్కడి పరిస్థితినిచూచి అలానే మ్రాన్పడిపోయింది!

సాధారణంగా ఆయన ఆకృతికంటే ముందు ఆయన పిలుపు చెవుల్లో పడేది. ఉన్నపళంగా వచ్చి యెదుటబడితే ఎంతో పొంగిపోయే వారాయన. అలాంటివారు యెప్పుడు వచ్చారోయేమో, సద్దూసడీ లేకుండా వచ్చి కట్టు బట్టలైనా విప్పకుండా కొట్టములో మంచము వాల్చుకొని పడుకొన్నారు-అది గూడ రంగడు పడుకొనే మంచంమీద!

అంతకంటే వేగంగా ఆలోచనలు!!

'ఒకవేళ తన పొరపాటు అతనికంట పడిందేమో! అందుకేనేమో, ఈ మానసికమైన బాధ!—అటువంటి అవకాశమే లేదు. అసలు వారు ఊళ్ళోనే లేరుగా! తాననుకొన్నట్లు అతని కంటబడి ఉంటే కత్తికి కండజేసి పొలిచల్లే అభిమానధనులే! తన గిలిగానీ, అలాంటిదేమీకాదు. ప్రయాణంలో యేదో అవాంతరం జరిగి ఉండవచ్చు. అని తన్ను తాను సమాధానపఱచు కొనింది. అతనిని సమీపించింది. "ఏవండీ....ఏవిఁటీ అన్యాయం?....ఇంతకూ యెప్పుడు రావడం? ఎందుకిక్కడ పడుకొన్నారు? లేవండీ!" అని బ్రతిమ లాడుతూ ప్రశ్న పరంపరలతో ముంచెత్తింది. కానీ ఆయన కదిలీ మెద ల్లేదు. తీక్ష్ణమైన ఆ చూపుల్లో మార్పు కనబడలేదు. అంతే! "లబో దిబో" మని మొత్తుకుంటూ కుప్పగ కూలిపోయింది తాను!

కొంపలకు నిప్పంటుకొన్నా, మేడలమీద నిలబడి వేడుకచూడడానికది పట్టణంకాదు. చీమ చిటుక్కుమంటే, గుండెలు కలుక్కుమనే మనస్తత్వం

పల్లెవాసులది. కాగా యిరుగు పొరుగు గుంపుగూడారు. ఎక్కడున్నాడో యేమో రంగడు ఒక్క అగువులో వచ్చిఅక్కడ వాలాడు. దిష్టి తగిలిందని, గాలిసోకిందని తలకొక్క తీరుగ మాట్లాడుతుంటే, భూతవైద్యుడు లిక్కి మునెప్పను పిలువమన్నారెవరో! ఆ మాటతో అతనికోసం పరుగెత్తాడు రంగడు. ఒకరు దిష్టి తీయమంటుంటే, ఒకరు ఎట్టనీళ్ళు దిగదీసి పోయ మంటున్నారు. వేపమండకోసం ఎవరో పరుగుదీశారు.

అంతలోనే అనుకోనివిధంగా ఆయనపైకి లేచారు!

"నాకేం భూతం, గాలి, దెయ్యం సోకలేదు. మీరు వెళ్ళండయ్యా!" అని విసుక్కున్నాడు. సాధారణంగా ఎంతో నెమ్మదిగా, నేర్పరితనంగా మాట్లాడే మనిషి, ఆ విధంగా చీదరించుకొనేసరికి, "నిజంగా యిది భూత లక్షణమే!" అన్నాడు ఒక నడికారాయన.

"మీకేనయ్యా చెప్పేది. నాకేమీ జబ్బులేదు. మీరు తప్పించి, నన్నేమీ భూతాలు, దెయ్యాలు పట్టలేదు. కాసేపు ప్రశాంతంగా ఉండ నీయండి. మీరు వెళ్ళండి బాబూ!" అని చేయెత్తి దండం పెట్టాడు ఆ చేయెత్తు మనిషి! 'ఇది మరీ బాగుండే వరస' అని గొణుక్కుంటూ ఒక్క రొక్కరుగ వీధిని బడ్డారు.

ఆయన విసుగ్గా యింట్లో అడుగుపెట్టారు. విసుగ్గానే నాలుగు ముంతలు నీళ్ళు పైన జల్లుకొన్నారు. అంతకంటే విసుగ్గానే నాలుగు మెతుకులు ఎంగిలిపడ్డారు. అంతే! ఆ రోజునుండి అదే వరుస. తింటే తింటారు. లేదా లేదు. ఇష్టముంటే పొలమువైపు పోతారు. లేదా లేదు. ఎవరేమి అడిగినా, మరేమి మాట్లాడినా, మౌనమే సమాధానం. లోపం ఎంచలేని తన ప్రయత్నంలోకూడ గంటలు, దినములు, నెలలు గడిచిపోయాయి. వచ్చిన భూతవైద్యులు, యిచ్చిన మంత్రాల ఫలితాన్ని ప్రకటించలేక తన బ్రతుకునకే పరీక్షపెట్టాయి. ఆ పరీక్షకు తట్టుకొని నిలబడడమే దుర్భరమయి పోయింది.

రోజులు దొర్లిపోతున్నాయి. పండిన కూడులాగ ఆయన ఆరోగ్యం కూడా క్షీణదశ పట్టింది. రాత్రిపూట ప్రశాంతంగా ఆయన పడుకొనివున్న సమయాన దగ్గర జేరడానికి ఒకటిరెండుసార్లు ప్రయత్నించింది. దాంతో ఆ రాత్రి ఆయన మళ్ళీ యెప్పుడు వస్తారో యేమో? స్నానానికి నీళ్ళు అన్న పానాదులు సిద్ధంగా అమర్చి తాను యెదురుచూస్తూ కూర్చోవలసిందే! ఆయన యెప్పుడైనా రావచ్చు. వచ్చి అంత యెంగిలిపడితే పడవచ్చు. లేదా, అలాగే పడి నిద్రపోవచ్చు. అయినా తానేమీ పలుకడానికి లేదు. జీవిత భాగస్వామినిగా తన హక్కు రద్దయిపోయింది. ఆలోచిస్తే ఆడదానికి యింతకు మించిన శిక్ష ఉండదేమో? ఇది తలచుకొన్నప్పుడంతా తన గుండె చెఱువయేది. ఆ గుండెఘోరంలో నిద్ర దూరమయేది. అలా యెన్నో రాత్రులు గడచిపోయాయి, తాను మేడమీద నిలబడి లోకాన్ని చూస్తూ ఉండగానే!— లోకం!—అనుకొంటూ ఉంటుంది తన ఆస్తిపాస్తులకు అంతస్థు గట్టి, తనది అందాలకాపురమని. కానీ వాళ్ళకేమీ తెలియదు. దూరంనుండి చూస్తే నునుపుదేరిన కొండలు, ఆకాశం ఒక్కటైపోయి, ఓ అర్ధవృత్తాకారాన్ని గీచినట్లు తోస్తుంది. కానీ ఎక్కడి కొండలు?....ఎక్కడి ఆకాశం?....తన బ్రదుకుకూడ అలాగే తయారయింది. అయినా ఆ బ్రతుకును అలాగే నెట్టుకొస్తూఉంది, 'ఏనాడైనా గట్టు చేర్చలేకపోతామా!' అన్న విశ్వాసంతో. కానీ ఆ విశ్వాసం ఆ నాటితో........

"అదుగో! ఆయన కన్నులు తెరిచారు" అన్నారెవరో!

అందరు మంచం చుట్టు గుమిగూడితే అందరికంటే ముందు తాను ఆయన తలదగ్గర నిలబడింది. ఎన్నడులేనిది ఆయన కండ్లు రెండు నిండుగా ఉన్నాయి. ప్రయత్నపూర్వకంగా తల దిండువైపు చూపులుంచి, చేతిని ఆ వైపు త్రిప్పబోయారు. అది గమనించిన తాను దిండుక్రింద వెదకింది. అక్కడ ఓ పొడుగాటి కవరు చేతికి దొరికితే, తాను తీసుకొనింది. ఆయన మెల్లగా ఆ కవరును అందుకొన్నారు. ఒకసారి తనవైపు....ఒకసారి

మంచం కాలికి తల ఆనించి యేడుస్తున్న రంగనివైపు ఎంతో ప్రయాసతో చూపులు త్రిప్పారు. ఆయన భావము, బాధ యెవ్వరికీ అర్థం కాకుండా బొమ్మల్లాగ నిలబడి ఉంటే, ఆయన ఆ కవరును రంగడి చేతిలో పెట్టారు.

'లక్ష్మమ్మ అదృష్టం! గండం గడచిపోయిందని' కొందరంటే, 'అది గాదయ్యా, యిది చావు తెలివని' కొందరన్నారు. ఏది యేమైనా భూత వైద్యుని చేతిలోని వేపమండ మరింత వేగాన్ని పుంజుకొంటే, ఆ గాలి ధాటికి తట్టుకోలేక అక్కడి దీపం 'గుటుక్కు' మనింది.

అందరూ ఒక్కసారి గొల్లుమన్నారు!.........

"చూడమ్మా! పోయినవాళ్ళతో కలిసి మనం పోలేం. అంతా ఋణం. ఆ ఋణం తీరిపోతే యెవరికెవరు? ఎవరిదోవ వాళ్ళదే తల్లీ! దిగులు పడి కూర్చుని సాధింగలిగింది మాత్రం యేముంది?"

కర్మక్రియలన్నీ జరిగిపోయిన తరువాత ఊరు వెడుతున్న తండ్రి నోటినుండి వెలువడిన అనునయ వాక్యాలు. తననుండి సమాధానం లేక పోయేసరికి మళ్ళీ ఆయన ఆరంభించారు.

"అమ్మడూ! అల్లుడి చేసిని పని నాకేమీ అర్థంకాలేదు. అసలు ఆ విధంగా చేయవలసిన అవసరం యేమి గలిగిందో యెంత ఆలోచించినా బుద్ధికందడంలేదు."

"మీకేగాదు నాన్నా, నాకు కూడ అర్థంకావడంలేదు ఆయన ఎందుకీ విధంగా చేసిపోయారో!" ఏదో మంచి సమాధానం చూపగలిగింది కానీ, కన్నకడుపుకే కడుపుచింపి చూపలేకపోయింది తాను.

"అదేనమ్మా నేనూ అనేది! లోకంలోలేని తీరుగా చేసిపోయాడు. బ్రతికినంత బ్రదుకు బ్రతికి కడకు సేద్యగాని చేతుల్లో నీ బ్రదుకు పెడతాడని కలలో గూడ తలంచలేదు. నా మాట వినుతల్లీ! రంగడు మంచివాడే కావచ్చు. కానీ డబ్బు!—దాని గాలి సోకకుండానే వుండాలి. ఆరంభమైతే

యిక దానికి అంతంలేదు. దయ, ధర్మము, నీతి, నియమము అన్నీ ఆ డబ్బుముందు తల వొగ్గవలసిందే!"

"అయితే నన్నేం చేయమంటారు నాన్నా!"

"నువ్వేమీ చేయవలసిన పని లేదమ్మా! 'ఊ!' అను. మూడు కోర్టుల కెక్కించి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తాను. నాకు తెలియని చట్ట మేముంది? వీడి పేరుతో వీలునామావుంటే సరిపోతుందా?"

డబ్బు మహిమ....రంగడి ప్రవర్తనలో మార్పు....కోర్టులు కచ్చేరీలు....యీ మాటలు మెదడును స్పృశించకముందే అంతరాత్మ మేలు కొనింది.

"నువ్వనుకొన్నావు చేసిన తప్పు యెవరి కంట పడలేదని! కానీ ఆయన కంటబడింది."

"నిజమా?"

"అవును. అందుకే ఆ మనోవేదనతోనే ఆయన కుళ్ళి కుళ్ళి కన్ను మూశారు."

"నేనేమీ కంటికావరంతో తప్పు చేయలేదు. కడుపుతీపి నన్ను ప్రోత్సహించింది. ఆయన దృష్టిలో అది తప్పుగా తోస్తే నన్ను దండించ వచ్చుగా!"

"ఆయన దృష్టికేగాదు—హైందవ సంప్రదాయానికి, సాంఘిక నియ మానికి నీ ప్రవర్తన గొడ్డలిపెట్టు. ఆయన మహోఉత్తముడు. దూరదృష్టి కలవాడు. ఇంతకాలము అతనితో కాపురంచేసి ఆమాత్రం గ్రహించలేక పోయావా నీవు! నిన్ను కించపరచి తాను కించపడదలచుకోలేదు కాబట్టే కిక్కురుమనకుండా ఆ బాధను భరించారు. అయినా, ఆయన నిన్ను దండించ లేదని భావిస్తున్నావా?"

"అవును మరి!"

"హాహాహా! పిచ్చిదానా! ఈ ఆస్తిపాస్తులను రంగడిచేతుల్లో పెట్టి

తంలోని అంతర్య మేమనుకొన్నావ్? ఈ సంపద తనది కావడంతో వాడి కళ్ళు నెత్తికెక్కుతాయి. అప్పుడు యెంత ప్రయత్నించినా వాడి కళ్ళల్లో నీవు పడవు. వాడి పెళ్ళాం నిన్ను కుక్కకన్నా హీనంగా చూస్తుంది. ఆ వాతావరణంలో యిక నువ్వుండలేవు. కడుపు చేతబట్టుకొని బయటపడితే అప్పుడు తెలుస్తుంది కడుపుతీపి!

"ఆఁ! యిదా ఆయన ఉద్దేశ్యం! అయితే మరో జన్మ, యమలోకం లాంటి మరో లోకం ఉన్నాయో లేవో నాకు తెలియవు. నా తప్పుకు ప్రాయశ్చిత్తం ఈ జన్మలో జరిగితీరవలసిందే!"

"ఏమిటమ్మా ఆలోచిస్తున్నావ్?" — తండ్రి హెచ్చరింపుతో అంతరాత్మ అదిరిపడి ఆగిపోయింది. సమాధానం చెప్పవలసిన బాధ్యత తన మీద పడింది.

"నాన్నా! నా చేతుల్లోకంటే రంగడి చేతుల్లోనే ఆస్తిపాస్తులు భద్రంగా ఉండగలవని ఆయన అభిప్రాయమైతే అలాగే జరుగనీ! బ్రదికిన కాలంలో కూడ ఆయన ఆత్మకు శాంతి కరువైపోయింది. ఇకమీదటగూడ ఆయన ఆత్మను బాధపెట్టలేను, మీతో సహకరించి. ఒకవేళ రంగడి ప్రవర్తనలో మార్పు అంటూ జరిగితే అది నా మేలుకొరకే!"

"బ్రదుకు ఉపన్యాస వేదికగాదు తల్లీ! - నీతినియమాలు వల్లించ దానికి. బాగా ఆలోచించు. కడుపుతీపి చెడ్డదికాబట్టి యింతగా చెబుతున్నాను. వెన్నుమీద గువ్వలా పెరిగిన బిడ్డవు. ఈ బాధలకు తట్టుకోలేక........"

"నాన్నా! అంత సులభంగా చస్తే, ఈ జన్మకు విముక్తిలేదు. బడిలేని మారుమూలపల్లెలో కన్నతండ్రి బాధ్యతలేగాక, బడిపంతుల బాధ్యతను గూడ నెత్తిన పెట్టుకొన్నారు కాబట్టే, ఈ జన్మకు అక్షరజ్ఞానము లభించింది. అప్పుడు నేర్పారు వాక్యమంటే అర్థం. అప్పుడు అర్థం వాక్యానికే పరిమితమనుకొన్నాను. కానీ యిప్పుడు గ్రహిస్తున్నాను. అది జీవితానికీ అర్థమని!"

తన ధోరణి అర్థం కాకుండా తండ్రి నివ్వెరపడి నిలబడిపోతే, తానే పూర్తిచేసింది. తాను 'కర్త' అయి చేసిన పని 'కర్మ' అయితే, జరుగ నున్న ఫలితం 'క్రియ' అని! తన మాటలు రుచించకపోగా, తండ్రి ఆగ్రహంతో అంతా గ్రహచారంమీదకు నెట్టి వెళ్ళిపోయాడు.

అంతే! ఆ తరువాత ఆయన మాటలు నిజం కావడానికి యెంతో కాలం పట్టలేదు. నెలలు తిరుగకముందే రంగడు ఆ యింటి యజమాని! ఆయనగారి సతీమణి సర్వాధికారిణి!! ఇక తన పాత్ర యిత్తడి రాగి పాత్రల పరిచయానికి దిగేటట్లు తోచింది ఆ సాధింపులు, చాటుపోటు మాటలు వినేసరికి! అంతే! కాసంత నీడకు మకాం ఊరికి ఉత్తరాన పూరి గుడిసెకు మార్చబడితే, జానెడు పొట్టకోసం గంప నెత్తికెక్కింది!.........

*　　　*　　　*

ఆమె నడుస్తూనే ఉంది!

ఆలోచనల్లో దోవ జరిగిన సంగతి తెలియనేలేదు. ఎప్పుడో తన పూరిగుడిసెలో అడుగుబెట్టింది. ఉసూరుమంటూ నెత్తిగంప నేలకు దించింది. గత స్మృతులతో మనసు వికల్పమైతే, అక్కడే—ఆ గంప ప్రక్కనే నేలకు వాలిపోయింది, ఇంతవరకు నెత్తికి చుట్ట అయిన పైట చెరగు నేలమీద పరుపుకాగా! అలా యెంతోసేపు గడువలేదు. ఆ బలహీనత ఆమెలో యెంతోసేపు నిలువలేదు. కర్తవ్యం మళ్ళీ ముందుకు లాగుతూ వుంటే, ఆమె పైకి లేచింది. ఎంత ప్రయత్నించినా ఆలోచనలు ముసురు కొంటూనే ఉన్నాయి, ఉట్టిమీద కూటినీళ్ళ చట్టిని ఎఱ్ఱచీమలు ముసురు కొన్నట్లు! గంపలోని సంచినితీసి ముందర వేసుకొనింది. అదిపాతగుడ్డలతో కుట్టిన నాలుగైదు పొరలుగల సంచి. పల్లెటూళ్ళల్లో తిరుగుతూ ఆకు వక్క అమ్మకొనేటప్పుడుఒకావిడ వడ్లుపెడితే,మరొక మగువ రాగులు పెడుతుంది. ఒక్కొక్క రకం గింజల్ని పోసుకొంటుంది ఒక్కొక్కపొరలో! ఆ విధంగా పోసుకొనేటప్పుడు యెంత జాగ్రతపడినా ఒక పొరలో గింజలు మరొక

పొరలో పడకమానవు. ఇంటికి వచ్చిన తరువాత నెమ్మదిగా కూర్చొని ఆ గింజలను వేర్పరచుకొని కుండల్లో భద్రపరచుకొంటుంది. ఆ రోజు ఒక్కొక్క పొరనే ఖాళీ చేస్తుంటే—రాగులు పోసిన పొరలో కాసిని వడ్లు కనుపించాయి. వాటిని ఆమె క్రిందపోసింది. పైట చెరగును చుట్టగాచుట్టి పిడికెడు నిండుకి పట్టుకొనింది. ఆ ధాన్యంమీద ఆ చుట్టను అలా వత్తి, పైకి లేపితే వడ్లు మాత్రం అ చుట్టకంటుకొంటాయి. అటుపై ఆ చుట్టను అవతలికి తీసి అలా తట్టితే వడ్లగింజలన్నీ వేరుగా రాలిపోతాయి. ఆమె ఆ గింజలను వేరుచేస్తూ ఉంది—కాదు —కర్మ సిద్ధాంతంతో పాప పుణ్యాలనే వేరుచేస్తూ ఉంది—వాటిని కన్నీళ్ళు ప్రక్షాళనం చేస్తూ ఉంటే!

నెత్తిమీది రావిఆకుమోపు క్రుంగదీస్తూంటే మేక ముందుకు లాగుతూంటే, భుజంమీద దోటి నడకతో పోటీ పడుతూంటే, అడుగు ముందుకు వేయలేక అవస్థపడుతున్న రాముడు కంటబడ్డాడు.

సాధారణంగా రోజూ అయితే, ఎక్కడిపని అక్కడ వదలిపెట్టి, ఒక్క ముంపులో వెళ్ళి మోపు దించుకొని, మేకనుదీసి గుంజకుకట్టి గంపలో మిగిలిన కాసిని గుగ్గిళ్ళు లేదా, రెండు వడలు వాడి చేతిలోపెట్టి, ఎంతో ఆప్యాయంగా ఎదకు హత్తుకొని 'ఏనాటికైనా నా బిడ్డకు మంచికాలం రాకపోదులే!' అని సంతృప్తిపడేది.

కానీ ఆ రోజు ఆమె మనస్సులో మనస్సులేదు.

మమకారం నశించిపోయింది. కాగా మనిషి కదలలేకపోతే, 'అమ్మా!' అని పిలిపించుకోవాలన్న ఆశతో తాను రాముణ్ణి కనుక్కొన్నా, రాముడు ఆయన బిడ్డగాదు. ఆయన బిడ్డయితే ఆయనలాగే బ్రదికేవాడు.

వాడు రంగడి బిడ్డ!

అందుకే రంగడిలాగే బ్రతుకుతున్నాడు!!-అన్న మనసులోని భావం మాటల రూపాన్ని సంతరించుకోలేక మధనపడిపోయింది!

*